# జాతర

## -సంపర శ్రీనివాసరావు

ఊరి పొలిమేరల నుంచే ఊళ్ళోని సంబరాల హడావిడి గమనించింది రవణమ్మ.

'కొంచెం నెమ్మదిగానే పోనీ... తొందరేం లేదు' కారు కుదుపులకు రవణమ్మ అలసి పోతుందన్నట్లుగా తగ్గించాడు రాయుడు.

కారు వేగం కొద్దిగా తగ్గింది.

ముఖం మీద రూపాయి కాసంత కుంకుమ, ముఖం అంతా దట్టంగా పూసుకొన్న పసుపులో ధగధగలాడిపోతోంది. నిండుగా అమె ముఖం విరిసిన పొద్దుతిరుగుడు పువ్వులా ఉంది.

ఆమె కారులో ప్రయాణం చెయ్యడం జీవితంలో అది రెండవ సారి.

మొదటిసారి పోలీసు జీపులో పట్నానికి వెళ్ళింది - ఇప్పుడు రాయుడి సొంత కారులో మహరాజ వైభవంతో తిరిగి వస్తోంది. అమె ఏనాడు ఆ పల్లెను విడిచి బస్సు ప్రయాణం కూడా చెయ్యలేదు.

కారు వెనుకనే రాయుడి అనుయాయులు మోటార్‌సైకిళ్ళ మీద స్కూటర్ల మీద వెంబడిస్తున్నారు. కారుకు ముందు రెండు మోటారు సైకిళ్ళు దారి చూపిస్తూ పైలట్ గార్డ్సలా సాగిపోతున్నాయి.

ఎర్రటి పట్టుచీర, చిలకాకు పచ్చరంగు అంచు, మాచింగ్ జాకెట్ వేసుకోనుంది రవణమ్మ.

వెనుక సీట్లోఒక మూలకు వొదిగి కూర్చుని ఉంది. ఆమె చూపులు నిస్తేజంగా ఎటో చూస్తున్నాయి.

అలవాటు లేని పెట్రోలు వాసన రాయుడి అతిమర్యాదల్లా కడుపులో దేవుతున్నట్లుగా ఉంది. మెల్లిగా తలతిప్పి రాయుడి కేసి చూసింది. యాదృచ్ఛికంగా అప్పుడే తలతిప్పి ఆమెను చూస్తున్న రాయుడు, ఆమె చూపుల్లోని తీక్షణతకు ఉలిక్కిపడి తలదించుకున్నాడు. ఏదో తెలియని భయం అతడి వెంట్రుకలు నిక్కబొడుచుకునేలా చేసింది.

అతడి కలవరపాటు చూసి కనిపించీ కనిపించనంతటి సన్నని నవ్వు ఆమె పెదాలపై నుంచి దొర్లింది.

'తప్పుకోండి - తప్పుకోండి - దార్లోంచి పక్కకి జరగండి' - కారు ముందున్న వాళ్ళు కేకలు పెడుతూ అదిలిస్తున్నారు.

'దండాలు తల్లీ - సల్లంగా కాపాడు తల్లీ' రెండు చేతులూ నెత్తిన పెట్టుకొని దణ్ణాలు పెడుతున్న పల్లీయుల్ని చూసి జాలిపడింది రవణమ్మ.

రవణమ్మకి 22 సంవత్సరాలుంటుంది వయసు. నల్లగా చేవదేరిన సరుగుడు కర్రలా ఉందామె. చిన్నతనం నుండీ కాయకష్టం చేసిన శరీరం కావడాన శరీరం పొంకంగా గట్టిగా ఉంటుంది.

ఊరు ఊరంతా సంబరాలు జరుపుకొంటున్నా మల్‌రెడ్డి ఇంట్లో స్మశాన నిశ్శబ్దం నిండి ఉంది.

మిద్దె గదిలో మల్‌రెడ్డి భార్య కంటికీ మంటికీ ఏకధారగా దుఃఖిస్తోంది. ఇప్పుడిప్పుడే మానుపడుతున్న ఆమె మనసులోని గాయాన్ని ఈ సంబరాలు మళ్ళీ కెలికినట్లయింది. మల్‌రెడ్డి చచ్చిపోయి ఆరునెలలే అయింది.

నడిమింట్లో ఊగుతున్న ఉయ్యాల గొలుసుల చప్పుడు దెయ్యాలు ఏడుస్తున్నట్లుగా భయానకంగా వినవస్తోందా నిశ్శబ్దంలో.

ఉయ్యాల మీద పడుకొని నుదుటి మీద మోచెయ్యి ఉంచుకొని యోగ నిద్రలో ఉన్నట్లుగా ఉన్నాడు, మల్‌రెడ్డి తమ్ముడు రాజిరెడ్డి. అతడి అనుయాయులంతా చుట్టూ చేరి మౌనంగా నిలబడ్డారు.

అతడు 'ఊ' అంటే ఊర్ని వల్లకాడు చెయ్యడానికి సిద్ధంగా ఉన్నట్లు కనపడుతున్నారు.

రచ్చబండకు ఎదురుగా ఉన్న ఎల్లమ్మగుడి దగ్గర ఆగింది కారు.

రవణమ్మ కారులోంచి కాలు కింద పెడుతూనే తలకాయలు పగిలినట్లు పగిలాయి కొబ్బరికాయలు.

పుటుక్కున తెగి నేలమీద రాలుతున్నాయి కోళ్ళ తలకాయలు.

అరచేతిలో కర్పూరం వెలిగించుకొని రవణమ్మకు హారతిని తిప్పుతున్నాడు ఆసాదుల వీరయ్య - అతడే ఆ ఊరికి గణాచారి.

నుదుట విభూది బొట్లతో ఒంటి నిండా పిండి కట్లతో నుదుటిన తిలకంతో సాక్షాత్తూ కైలాసం నుంచి దిగివచ్చిన అపర రుద్రుడిలా ఊగిపోతున్నాడు వీరయ్య.

రవణమ్మ రీవిగా నడుచుకొంటూ అమ్మవారి పక్కనే ఉన్న కొలుపుల గద్దె మీద కూచుంది.

తప్పెట్లు, డప్పులు, తాళాల మోత మిన్నుముట్టింది. రెండు చేతులూ ఎత్తి అందర్నీ దీవించింది. ప్రసాదాలు స్వీకరించింది. ఆమె ఎంగిలి చేసిన ప్రసాదం కోసం ప్రజలంతా తోసుకుంటూ ముందుకు వస్తున్నారు.

అరటి పండు సగం కొరికి రాయుడి మీదికి విసిరింది రవణమ్మ-

రాయుడి మొహం జేవురించుకుపోయింది. రవణమ్మ విసిరిన ఎంగిలి పండు తినాలా వద్దా అని సందేహించాడు. భవిష్యత్ గురించిన ఆలోచన అతడి అసహ్యాన్ని అధిగమించేలా చేసి అతడి చేత తినిపించింది.

గర్వంగా నవ్వుకొంది రవణమ్మ.

ఆ రోజు కల్లు, సారాయిలు వరదలా ప్రవహించాయి. రాత్రి పది గంటల వరకూ సంబరాలు జరుగుతూనే ఉన్నాయి.

రవణమ్మ లేచి తిన్నగా నడుచుకొంటూ తన ఇంట్లోకి వెళ్ళి తలుపేసుకుంది.

అప్పుడు నవ్వింది రవణమ్మ- మనసారా నవ్వుకొంది-

పసుపురాసుకొన్న మొహం ఎరుపెక్కేలా నవ్వుకొంది - కళ్ళల్లోంచి రక్తధారలు - అశ్రుధారలుగా కారేటట్లుగా నవ్వింది.

ఎనిమిది సంవత్సరాల పగ చల్లారేట్లు నవ్వింది. అలా నవ్వుతూనే మంచం మీదికి ఒరిగింది.

★★★

రవణమ్మకు అప్పుడు పధ్నాలుగేళ్ళ వయసు. మొహంలో ఇంకా పసితనం పోలేదు. పెళ్ళంటే అర్థమయ్యే వయసూ రాలేదు.

బయట తనతో పాటుగా బర్రెలు కాసుకొనే కుర్రాళ్ళతో గోటీబిళ్ళ ఆటలో ఆమె తీవ్రంగా మునిగిపోయింది.

అంతలోనే తండ్రి అక్కడకు రావడం - తనను రెక్కబట్టి బరబరా ఈడ్చుకెళ్ళడం చూసి విస్తుపోయింది.

'ఈ రోజు నుంచీ నువ్వు ఇల్లు కదలడానికి వీల్లేదు'

'చిన్నపిల్ల - అదేం చేసిందయ్యా- అట్టా గుసురుతున్నావు'

'నువ్వు మద్దెలో కలిగించుకోక' - అతడు విసురుగా తోసేసరికి గది మూలకి పడిందామె.

ఏనాడూ తల్లిని గానీ - తనను గానీ పల్లెత్తు మాట అనకుండా



అపురూపంగా చూసుకునే తండ్రికి - ఈ రోజేమయిందో అర్థం కాక విస్తుపోయి చూసింది రవణమ్మ.

'దాని బతుకూ, మన బతుకూ బుగ్గిపాలు కాకూడదనే నేనిలా చేత్తన్నాను - నా మాటకు ఎదురుసెప్పి అది గానీ కాలు గుమ్మం బయటకు పెట్టిందా - ఇద్దర్నీ నరికేసి, నన్ను నేను నరుక్కుంటాను'

అతడి గొంతులో దుఃఖంతోపాటు ఆవేదన, ఆవేశం కూడా తొంగి చూస్తున్నాయి.

'పెద్దరెడ్డిగారి మల్‌రెడ్డి కళ్ళు దీని మీద పడ్డాయి. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిది'

రవణమ్మ పడుకొందనుకొని తల్లితో అంటున్న తండ్రి మాటలు రవణమ్మ చెవిలో పడ్డాయి. అయినా ఆమెకేమీ అర్థం కాలేదు.

ఆ తరవాత వారం రోజులకే రవణమ్మ తండ్రి భార్యనూ కూతురునూ తీసుకొని పట్నం వెళ్ళిపోవాలని నిర్ణయానికి వచ్చాడు.

ప్రయాణం రెండు రోజులుందనగా పిడుగులాంటి వార్త అతడిని నిలువునా కూల్చేసింది.

ఆ రోజు రచ్చబండ దగ్గర అందరూ ఉండగా ముత్తేలమ్మకు పూనకం వచ్చేసింది. వీరంగం తొక్కేసింది. ఊరు ఊరంతా కదలి వచ్చింది.

'అమ్మా తల్లీ! ఏం కావాలమ్మా- ఎందుకీ ఆగ్రహం తల్లీ' గుండెలు బాదుకుంటూ అడుగుతున్నారు.

చేతుల్లోని వేపరెమ్మలు విసురుగా ఆడించింది. రచ్చబండ దగ్గరి పెద్దలంతా చేతులు కట్టుకొని నిలబడ్డారు.

గణాచారి పీక పట్టుకొని విసురుగా తోసింది. విసవిసా నడుచుకుంటూ కొలుపుల దిమ్మ మీద కూర్చుంది.

'మంటలు - మంటలు' పెద్దగా అరిచింది. జాకెట్టును విసురుగా చింపుకొని గ్రామ పెద్దల వైపు విసిరింది.

అమ్మవారి కాళ్ళ దగ్గర పడున్న పసుపు కుంకుమలు తీసి ఛాతీ మీద దట్టంగా పులుముకొంది.

నగ్నంగా ఉన్న ఆమె ఛాతీని చూసి రాయుడు గుటకలు మింగాడు. మల్‌రెడ్డి చూపులు కూడా అక్కడే ఉన్నాయి.

అవేవీ గమనించనట్టుగానే అమె కేకలు వేస్తూ అరుస్తూ చెబుతోంది.

'రేపే ఏకాదశి - నాకు సంబరాలు సేయాల. లేకుంటే ఊరు నాశనం, పంట నాశనం, పశువులు నాశనం - నాకు కొలుపులు సేయాల-'

నేను కోరుకున్న సిన్నది ఊరు దాటేదానికి లేదు - నరిశిమ్మ కూతురు రవణమ్మను నాకు నైవేద్యం చెయ్యాల - నా కోసం ఇడిసిపెట్టాల - మాట తప్పిరో ఊరినే మింగుతా - నాశనం - సర్వనాశనం'

ఆవేశంతో ఊగిపోతూ ఆజ్ఞల్ని జారీ చేసింది.

ఊరు ఊరంతా ఏకమై నరిశిమ్మ ఎంత మొరపెట్టుకుంటున్నా వినకుండా మర్నాటి సంబరాల్లో రవణమ్మ బలిపశువై పోయింది. ఆమెకు కొలుపులు చేశారు. రవణమ్మ కాళ్ళకు మొక్కారు - వేటపోతుల్ని కోళ్ళనూ బలిచ్చారు. అమ్మవార్ని శాంతింపజేశారు - ఒక పసిమొగ్గని నిర్దాక్షిణ్యంగా నలిపేశారు.

ఆ రోజు నుంచి రవణమ్మ మకాం గుడికి ఆనుకొని ఉన్న పెంకుటింటి గదిలోకి మారిపోయింది.

వారం రోజులకి మల్‌రెడ్డి పాలేరు పెళ్ళాం ముత్తేలమ్మ పాము కరిచి చచ్చిపోయింది.

ఏడాది తిరక్కుండానే రవణమ్మ తల్లిదండ్రులు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

తల్లీ తండ్రీ చచ్చిపోయిన మూణ్ణెల్లకు రవణమ్మ పెద్దమనిషయింది.

ఊరు ఊరంతా పండుగ చేసుకొంది. సంబరాలు జరిగాయి.

అప్పటి నుండీ ఇప్పటివరకూ మల్‌రెడ్డికి, అతడి తమ్ముళ్ళకూ, మునసబు కరణాలకూ వారి పశువాంఛలు తీరుస్తూ మనసులో పగ పెంచుకుంటూ జీవచ్ఛవంలా బతికింది.

సరిగ్గా నాల్గు నెలల క్రితం పట్నం నుంచి వచ్చిన ఒక లాయరుతో ఓ రాత్రి గడిపింది.

'నీలాంటి వాళ్ళతో జాగ్రత్తగా ఉండాలి సుమా!'

'ఎందుకు బాబూ అంత భయపడతారు'

'ఊరంతా నిన్ను అమ్మవారిగా కొలుస్తారు కదా! అలాగే నీకు పూనకాలు గట్రా వస్తుంటాయి. ఒకవేళ ఎవర్నైనా ఆ పూనకం సమయంలో మర్డర్ - అంటే హత్య చేసి చంపేసినా - రేపు కోర్టులో - స్కిజోఫ్రెనియా అంటూ సైంటిఫిక్ రీజనింగ్ చూపించి, శిక్ష నుంచి సులభంగా తప్పించుకోవచ్చు'

అతను చెప్పిన మాటలు అక్షరం అక్షరం రవణమ్మ తన మనసులో ముద్రించుకొంది. ఆ రాత్రి అతడి నుంచి మరిన్ని వివరాలు సేకరించింది.

నెల రోజులు గడిచాక ఒకరోజు మధ్యాహ్నం పూట మల్‌రెడ్డి రవణమ్మ దగ్గరకు వచ్చాడు.

'ఏందీ దొరగారికి ఏళాపాళా కూడా తెలుత్తల్లేదు'

'నీ మీద మనసవడానికి ఏళాపాళా ఎందుకే' విసురుగా దగ్గరకు లాక్కుంటూ అన్నాడు.

'చెరువు కింది రెండెకరాలు నీ పేరున రిజిస్టరు చెయ్యాలనుకుంటున్నాను' చుట్టపొగను బలంగా పీల్చి చెప్పాడు.

గుంటనక్కలాంటి మల్‌రెడ్డి దేనికో పెద్ద చేపకే గాలం వేస్తున్నాడని ఊహించింది. అందుకే ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఊరుకొంది.

'రవణమ్మా - నీతో ఓ విషయం చెప్పాల. కొంచెం అత్యవసరంగా కొంత డబ్బు కావాల్సొచ్చింది. నాకు నువ్వే సాయం చెయ్యగలవు. దానికి బదులుగా నీకు రెండెకరాలు రిజిస్టర్ చేస్తాను'

'మాకాడ ఏం వుంటది బాబూ - సంబరాలప్పుడు వచ్చిన డబ్బులో ఖర్చులు పోగా - గణాచారికి బత్తెం పోగా మిగిలింది ఏడాది మొత్తం గంజినీళ్ళకు సరిపోతుంది. అప్పుడప్పుడు మీలాంటి దొరలు ఇచ్చిన పదీ పరకా పై ఖర్చులకు సరిపోతుంది'

'అందుకే కదా - ఆ రెండెకరాలూ నీ పేరు మీదుంటే దాని మీది ఆదాయంతో నువ్వూ దొరసానిలా దర్జాగా బతకొచ్చు'

'నువ్వు చెయ్యాల్సిందల్లా - అమ్మవారికి సంబరాలప్పుడు తగిలించే ఎర్రరాళ్ళ చంద్రహారం నాకిస్తే - ఈ ఏడాది సంబరాల హడావిడిలో దొంగతనం జరిగిందని పంచాయతీలో పెట్టి గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడిపిస్తాను - ఊళ్ళో వాళ్ళ నోళ్ళూ మూయిస్తాను. నీ వాటాకి రెండెకరాలు రాసిస్తాను'

రెడ్డి మనసులో ఉన్న మాట చెప్పాడు. ఆ హారం ఎంత కాదనుకున్నా అయిదారు లక్షలకు తక్కువ చెయ్యదు.

రవణమ్మ మనసులో ఇంకో ఆలోచన చోటు చేసుకొంది. గుట్టు చప్పుడు కాకుండా గుడి తాళాలు రెడ్డి చేతిలో పెట్టి అతడినే తెచ్చుకోమంది.

వీధిలో ఎవరూ లేకుండా చూసి గుళ్ళోంచి హారం తెచ్చుకొని జేబులో వేసుకొన్నాడు రెడ్డి. 'తాళాలు మీ దగ్గరే ఉంచుకొని - ఒకవేళ ఏదైనా గొడవైతే రేపు మళ్ళీ హారం తెచ్చి గుళ్ళో పెట్టెయ్యండి' అని చెప్పింది రవణమ్మ.

గుళ్ళోని అమ్మవారి మిగిలిన నగలు అతడిని ఊరిస్తూ ఉండడంతో కలిసొచ్చిన అదృష్టంగా భావించి తాళాలు తనే ఉంచుకున్నాడు.

సాయంత్రం వరకూ రవణమ్మతోటే గడిపి అక్కడి నుంచి లేచి వచ్చి రచ్చబండ దగ్గర కూచున్నాడు.

పదినిమిషాలు తిరక్కుండానే గుడి ముందు కోలాహలం మొదలయింది. రవణమ్మ పూనకం వచ్చి ఊగిపోతోంది. ఊళ్ళోని జనమంతా చేరుకుంటున్నారు. గణాచారి తన దగ్గరి తాళాలతో గుడి తలుపులు తెరిచాడు.

'అమ్మా తల్లీ - కరుణించు తల్లీ - ఎందుకీ ఆగ్రహం?' అడుగుతున్నారు అందరూ.

'ఊరి పెద్దల్ని పిలవండ్రా' ఖంగుమంది రవణమ్మ గొంతు.

పెద్దలంతా చేతులు కట్టుకొని నిలబడ్డారు. రవణమ్మ చిందులు తొక్కుతోంది. బలిపీఠం పక్కన ఉన్న కత్తిని చేతిలోకి తీసుకొని వీరంగం ఆడింది. ఉండుండి ఒక్క వేటుతో మల్‌రెడ్డి తలకాయను తేగేసింది.

గిలగిలా కొట్టుకుంటూ మల్‌రెడ్డి ప్రాణాలు విడిచిపెట్టాడు.

'వీడు నా గుళ్ళోనే దొంగతనం చేశాడు. నా చంద్రహారం మీద చెయ్యేసాడు. నా హారం నాకివ్వండిరా' రంకెలు పెట్టింది.

మల్‌రెడ్డి జేబులోంచి గుడి తాళాలూ చంద్రహారం బయటపడటంతో ఊరు ఊరంతా ముక్కున వేలేసుకొంది. అమ్మవారు సత్తెమైన తల్లంటూ దణ్ణాలు పెట్టారు.

ప్రధాన ప్రత్యర్థి అడ్డు తొలగడంతో రాయుడు మనసులో సంతోషించాడు - మీసం మెలేసాడు. డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెట్టాడు పెద్ద లాయర్లను పెట్టి రవణమ్మ మీద కేసు కొట్టేయించాడు.

రవణమ్మను నిర్దోషిగా - క్షేమంగా బయటకు తీసుకొచ్చాడు. ఈసారి ఎలక్షన్లో తాను ప్రెసిడెంటు కావడం ఖాయం అనుకున్నాడు. ఊరి ప్రజలు నమ్ముకొనే అమ్మవారు తిరిగి ఊళ్ళోకి అడుగుపెట్టినందుకు భారీగా ఖర్చుపెట్టి సంబరాలు చేయించాడు.

గతం తాలూకు ఆలోచనల్తో రమణమ్మ నిద్రలోకి జారుకుంది.

తానే ప్రెసిడెంటు అయినట్లు కలగంటూ రాయుడూ నిద్రపోయాడు.

జరగబోయే రక్తపాతాలకు సాక్షీభూతంలా

రవణమ్మ నుదుటి మీది బొట్టులా ఆ పల్లెలో సూర్యుడు తూర్పున ఎర్రగా ఉదయిస్తున్నాడు.

★